# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ డిసెంబర్ 15 ఆదివారం 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 141

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## చిత్తశుద్ధితో గురుకులాల

# ప్రక్షాళన

హైదరాబాద్:'తెలంగాణ విద్యార్థులను దేశ సంపదగా మార్చేందుకు చర్యలు చేపట్టాం. రాష్ట్రంలోని 3900 సంక్షేమ వసతిగృహాల్లో చదువుకుంటున్న విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీస్తాం. వీటిని బహుళ నైపుణ్యాల విద్యాసంస్థలుగా తీర్చిదిద్దనున్నాం. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లోనే చదువుకునేలా కార్యాచరణ రూపొందించనున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. వసతిగృహాల్లో పిల్లల కోసం 'కామన్ డైట్' పథకాన్ని హైదరాబాద్ శివారు చిలుకూరులోని సాంఘిక సంక్షేమ వసతిగృహంలో సీఎం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సంక్షేమ వసతిగ్రృహాల్లో చదువుకునే విద్యార్థులందరికీ ఒకే తరహా భోజనం ఇచ్చేందుకు కామన్‌డైట్ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించామని తెలిపారు. డైట్ ఛార్జీలు 40 శాతం, కాస్మెటిక్ ఛార్జీలు 200 శాతం ఒక్కసారిగా పెంచామని గుర్తుచేశారు.

**సమస్యలకు మనదే బాధ్యత**

అన్ని కేటగిరీల సంక్షేమ వసతిగృహాలు, కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పెట్టే అన్నంలో పురుగులొస్తున్నాయని, ఫుడ్ పాయిజన్ జరిగిందని పత్రికల్లో, టీవీల్లో వార్తలొస్తున్నాయి. పిల్లలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని, చలికాలంలో వారికి రగ్గులు కూడా లేవని, కొన్నిచోట్ల తాగునీరు ఉండడం లేదని విమర్శలొస్తున్నాయి. వీటన్నిటికీ మనమే బాధ్యత వహించాలి. గ్రామీణ ప్రాంతాల్లోని తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులతో తమ పిల్లలను హాస్టళ్లలో చేర్పిస్తున్నారు. అలాంటి పేద పిల్లలకు నాసిరకం ఆహారం ఇవ్వడం సరికాదు. అందుకే నిధుల సమస్య రాకుండా.. ప్రతినెలా పదో తేదీ లోపు అన్ని సంక్షేమ వసతిగృహాల బిల్లులు మంజూరయ్యేలా గ్రీన్‌ఛానెల్‌ను ఏర్పాటు చేశాం. భోజన నాణ్యతను పరిశీలించేందుకు స్థానిక ఎమ్మెల్యేలు, అధికారులు హాస్టళ్లను సందర్శించాలని ఆదేశిస్తున్నాం. మెస్ మేనేజ్‌మెంట్ కమిటీలో విద్యార్థులను భాగస్వాములను చేయాలి. ఏటా విద్యాసంవత్సరం ప్రారంభంలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం ఇవ్వాల్సి ఉండగా... వాటిని సక్రమంగా ఇవ్వడం లేదు. యూనిఫాం కుట్టే బాధ్యతను స్వయంసహాయక సంఘాలకు అప్పగించాం. పాఠ్యపుస్తకాలు ముందుగానే సిద్ధం చేయాలంటూ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నాం.

**విద్యార్థుల సంఖ్యను పెంచుదాం**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలి. తల్లిదండ్రులను కలుసుకుని.. సర్కారీ బడుల్లో బోధన నైపుణ్యాలు, ఆంగ్ల మాధ్యమం, నాణ్యమైన మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాల గురించి వివరించాలి. పాఠశాలల మెరుగు కోసం కార్యాచరణ రూపొందించాం. బడ్జెట్‌లో విద్యాశాఖకు రూ.21 వేల కోట్లు కేటాయించాం.

**అంతర్గత నైపుణ్యాలకు ప్రోత్సాహం**

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల్లో అంతర్గత నైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ కేంద్రాలు, యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలు, యంగ్ ఇండియా స్కిల్స్ విశ్వవిద్యాలయం, యంగ్ ఇండియా స్పోర్ట్స్ విశ్వవిద్యాలయం వంటివి ఏర్పాటు చేస్తున్నాం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివరించారు.

చిలుకూరులో సహపంక్తి భోజనం చేస్తూ.. విద్యార్థులతో ముచ్చటిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

చిలుకూరు సాంఘిక సంక్షేమ వసతిగృహంలో కామన్‌డైట్ పథకం ప్రారంభించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి

రేవంత్‌రెడ్డి విద్యార్థులతో కాసేపు సరదాగా మాట్లాడారు. సీఎంతో మాట్లాడుతున్నందుకు నీకు ఎలా ఉందని ఆయన ఒక విద్యార్థిని ప్రశ్నించగా.. చాలా సంతోషంగా

ఉందని అతడు బదులిచ్చాడు. మరో విద్యార్థితో మాట్లాడుతూ.. భవిష్యత్తులో నీవు ఏం కావాలనుకుంటున్నావని అడిగారు. మృదంగం వాయించిన విద్యార్థులను

, పాటపాడిన మరో విద్యార్థిని అభినందించారు. ఇంటర్మీడియెట్‌లో

అత్యధిక మార్కులు సాధించి ఐఐటీ, వైద్యకళాశాలల్లో చదువుకొంటున్న విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు బహూకరించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి,

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, సంక్షేమ గురుకుల విద్యాలయాల కార్యదర్శి శ్రీధర్, సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి అలుగు వర్షిణి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ శోభారాణి, రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి, రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



'తెలంగాణ విద్యార్థులను దేశ సంపదగా మార్చేందుకు చర్యలు చేపట్టాం. రాష్ట్రంలోని 3900 సంక్షేమ వసతిగృహాల్లో చదువుకుంటున్న విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీస్తాం. వీటిని బహుళ నైపుణ్యాల విద్యాసంస్థలుగా తీర్చిదిద్దనున్నాం. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లోనే చదువుకునేలా కార్యాచరణ రూపొందించనున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.



2లో..

# కాంగ్రెస్ నిర్లక్ష్యం

## గురుకుల పాలిట శాపం

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శించిన హరీశ్‌రావు

వరుస ఘటనలతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో కలవరం

కనీసం నాణ్యమైన ఆహారాన్ని కూడా అందించలేరా..? : హరీశ్‌రావు

## దేశానికే ఆదర్శంగా

# కులగణన



2లో..

98 శాతం కులగణన పూర్తి

ప్రభుత్వం ఇస్తున్న గ్యారెంటీలు పేదలకే అందుతున్నాయ్

అమ్మలా ఉండే తెలంగాణ తల్లినే తెచ్చుకున్నాం

రైతాంగ పోరాటంలో తెగువ చూపిన దొడ్డి కొమురయ్య

కురుమ భవన ప్రారంభ కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి

# మహిళపై చిరుత దాడి

**తలకు తీవ్ర గాయాలు.. రిమ్స్ ఆసుపత్రికి తరలింపు**



**ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లాలో మరోసారి చిరుత విరుచుకుపడింది. బజార్ హత్నూర్ మండలం డెడ్రాలో బహిర్భూమికి వెళ్లిన మహిళపై చిరుత దాడి చేసింది. చిరుత దాడిలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావంతో బాధపడుతున్న బాధితురాలిని స్థానికులు గమనించి.. చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. బాధితురాలిని భీమాబాయిగా గుర్తించారు. బాధితురాలి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆమె కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.ఇటీవలే కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఓ యువతిపై పులి దాడి చేసి ప్రాణాలు తీసిన సంగతి తెలిసిందే. జిల్లాలోని కాగజ్‌నగర్ మండల పరిధిలోని బెంగాలీ క్యాంపు ఆరో నెంబర్ విలేజ్ సమీపంలో గన్నారం గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళ కూలీకి వెళ్లింది. పత్తి చేనులో పత్తి ఏరుతుండగా.. పులి వెనక నుంచి అకస్మాత్తుగా దాడి చేసింది. ఊహించని పరిణామం యువతి పులిని ప్రతిఘటించలేకపోయింది. దీంతో పులి మహిళ మెడ భాగంలో తీవ్రంగా దాడి చేసింది.

# కేసు విషయంలో ఎన్నో మాట్లాడాలని ఉన్నా

కోర్టు ఆదేశాల మేరకు మాట్లాడలేకపోతున్నా

థియేటర్‌లో అనుకోకుండా జరిగిన ఘటన

ఘటనలో నా ప్రమేయం లేదు: అల్లు అర్జున్

త్వరలోనే బాధిత కుటుంబాన్ని కలుస్తా

చంచల్‌గూడ జైలు నుంచి విడుదలైన అల్లు అర్జున్

అల్లు అర్జున్ అరెస్టును ఖండించిన సినీ ప్రముఖులు



2లో..

# దేశ ఐక్యతకు

## రాజ్యాంగమే ఆధారం

దానిని దెబ్బతీసేందుకు విషబీజాలు

భారత రాజ్యాంగానికి 75 ఏళ్లు పూర్తి

ఇవి యావత్ దేశం గర్వపడే క్షణాలు

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిది

ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు



2లో..



2లో..

# రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి అమలు.

బీజేపీ రాజ్యాంగాన్ని రక్షిస్తాననడం విడ్డూరం

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యా

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# దేశ ఐక్యతకు రాజ్యాంగమే ఆధారం



**న్యూఢిల్లీ:** భారత రాజ్యాంగం ఎన్నో దేశాలకు స్ఫూర్తిగా నిలిచిందని ప్రధాని మోదీ అన్నారు. ఎందరో మహనుభావులు కలిసి మన రాజ్యాంగాన్ని రచించారని చెప్పారు. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక్‌సభలో నిర్వహించిన ప్రత్యేక చర్చలో మోదీ మాట్లాడారు. ప్రజాస్వామ్య పండుగను ఘనంగా నిర్వహించుకుంటున్నామని, ఇవి దేశ గర్వపడే క్షణాలని అన్నారు. "దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిది. దేశ అధ్యక్షురాలిగా ఆదివాసీ మహిళ ఎన్నికయ్యారు. మహిళలకు అన్ని రంగాల్లోనూ గౌరవం దక్కాలి. మన రాజ్యాంగం మహిళలకు అన్ని విధాలుగా అండగా నిలిచింది. దేశం అభివృద్ధి చెందాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. ఈ దేశాన్ని వికసిత్ భారత్‌గా మార్చాలి. ప్రజల మధ్య ఐకమత్యం దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది. భిన్నత్వంలో ఏకత్వం మనదేశ గొప్ప విధానం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత స్వార్థపరుల వల్ల అనేక కష్టాలు పడ్డాం. బానిస మనస్తత్వంతో ఉన్నవాళ్లు దేశాభివృద్ధికి ఆటంకం కలిగించారు. దేశ ఐక్యతను దెబ్బతీసేందుకు కొందరు విషబీజాలు నాటారు" అని మోదీ అన్నారు. ఉపాధిని వెతుక్కుంటూ పేదలు పలు ప్రాంతాలకు వెళ్తారని, 'పేదలకు ఇబ్బంది లేకుండా 'వన్ నేషన్ - వన్ రేషన్ కార్డ్' విధానాన్ని తీసుకొచ్చామని చెప్పారు. "పేదలు ఎక్కడున్నా రేషన్ సులువుగా తీసుకోగలగాలి. ఆయుష్మాన్ కార్డు ద్వారా ఉచితంగా వైద్య చికిత్స అందిస్తున్నాం. డిజిటల్ ఇండియా దిశగా దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం. మన రాజ్యాంగం అన్ని భాషలను గౌరవించింది. రాష్ట్రాల మాతృభాషల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టాం. మాతృభాషలో చదివిన పిల్లల్లో సమగ్ర వికాసం సాధ్యపడుతుంది" అని మోదీ అన్నారు. "మన రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేందుకు, రాజ్యాంగ నిర్మాతల కృషిని మట్టిపాలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నించింది. భిన్నత్వంలో ఏకత్వ భావనను ఆ పార్టీ అర్థం చేసుకోలేదు. రాజ్యాంగ శక్తి, ప్రజల ఆశీర్వాదం మాకున్నాయి. మా పరిపాలన చూసి ప్రజలు మూడు సార్లు మాకు అధికారం ఇచ్చారు. ఎన్ని కష్టాలు వచ్చినా రాజ్యాంగ పరిరక్షకులు ప్రజలు అండగా నిలిచారు. ఈ దేశాన్ని ఒకే కుటుంబం 55 ఏళ్లపాటు పాలించింది. ఆ కుటుంబం ఈ దేశానికి అనేక విధాలుగా నష్టం కలిగించింది. 1947 నుంచి 1952 వరకు ఎన్నికైన ప్రభుత్వం మనకు లేదు. ఆ సమయంలో ఆ కుటుంబం ఈ దేశానికి చేసిన నష్టం అంతా ఇంతా కాదు. రాజ్యాంగాన్ని ఖూనీ చేసేందుకు అనేక విధాలుగా ప్రయత్నించారు. రాజ్యాంగ మార్పుపై రాష్ట్రాల సీఎంలకు నెహ్రూ లేఖలు రాశారు. ఆయన తప్పు చేస్తున్నారని అప్పటి స్పీకర్ రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. ఎంతోమంది పెద్దలు సలహాలు ఇచ్చినా నెహ్రూ వినలేదు. రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేందుకు అనేకసార్లు ప్రయత్నించారు" అని మోదీ వ్యాఖ్యానించారు. "ఆనాటి కాంగ్రెస్ నేతలు రాజ్యాంగానికి 75 సార్లు సవరణలు చేశారు. ఎమర్జెన్సీ విధించి ప్రజల హక్కులు హరించారు. వేలాది మందిని జైళ్లకు తరలించారు. కోర్టుల నోరు, పత్రికల గొంతు నొక్కేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పదోన్నతిని కూడా అడ్డుకున్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం అనేక కుట్రలు పన్నారు. నెహ్రూ, ఇందిర, రాజీవ్ ముగ్గురూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీశారు. కీలక నిర్ణయాలు తీసుకునేది పార్టీ అధ్యక్షురాలు అని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అన్నారు. ఇదే కాంగ్రెస్ పాలన తీరుకు నిదర్శనం" అని మోదీ విమర్శలు గుప్పించారు. లోక్‌సభలో రాజ్యాంగంపై రెండో రోజులుగా చర్చ జరుగుతోంది. అధికార, విపక్ష ఎంపీలు రాజ్యాంగంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. రాజ్యాంగంపై చర్చకు ప్రధాని మోదీ సమాధానం ఇస్తున్నారు. నిన్న రాజ్‌నాథ్ సింగ్ లోక్‌సభలో రాజ్యాంగంపై చర్చను ప్రారంభించారు. దీనిపై విపక్షాల నుంచి ప్రియాంక గాంధీ స్పందించారు. రెండో రోజు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రారంభించారు. రెండో రోజు కాంగ్రెస్ ఎంపీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రాజ్యాంగంపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సమయంలో అదానీ, అగ్నివీర్, పార్శ్వ ప్రవేశానికి సంబంధించి మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డాడు. ఈ నేపథ్యంలోనే విపక్షాల ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభకు వచ్చారు. ప్రధాని మోదీ లోక్‌సభకు చేరుకోగానే బీజేపీ ఎంపీలు జై శ్రీరామ్ నినాదాలు చేయడం ప్రారంభించారు. 75 ఏళ్ల రాజ్యాంగ యాత్ర గొప్ప ప్రయాణం అని ప్రధాని మోదీ అన్నారు. మన రాజ్యాంగ నిర్మాతల దీర్ఘకాలిక దృక్పథం, సహకారంతో ముందుకు సాగుతున్నాం. ఇది సంబరాలు జరుపుకోవాల్సిన క్షణం అని ప్రధాని మోదీ అన్నారు. ఈ ఉత్సవంలో పాల్గొన్న వారందరికీ ప్రధాని మోదీ అభినందనలు. లోక్‌సభలో రాజ్యాంగంపై జరిగిన చర్చకు ప్రధాని మోదీ స్పందిస్తూ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు, ఆ సమయంలో భారతదేశానికి వ్యక్తీకరించిన అన్ని అవకాశాలను అధిగమిస్తూ భారత రాజ్యాంగం ఇక్కడికి తీసుకువచ్చిందని అన్నారు. ఈ గొప్ప విజయానికి రాజ్యాంగ నిర్మాతలతో పాటు దేశంలోని లక్షలాది మంది పౌరులకు గౌరవపూర్వకంగా నమస్కరిస్తున్నానన్నారు. రాజ్యాంగ నిర్మాతలు ఈ విషయంలో చాలా స్పృహతో ఉన్నారని ప్రధాని మోదీ అన్నారు. 1950 నుంచి భారతదేశంలో ప్రజాస్వామ్యం వస్తోందని నమ్మలేదు. భారతదేశ ప్రజాస్వామ్యం, భారతదేశ గణతంత్ర గతం చాలా గొప్పది. ప్రపంచానికి స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు ప్రధాని మోదీ. అందుకే భారతదేశాన్ని నేడు ప్రజాస్వామ్య మాతగా పిలుస్తున్నారు. మనది భారీ ప్రజాస్వామ్యం మాత్రమే కాదు, ప్రజాస్వామ్యానికి తల్లి కూడా అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. మహిళా సాధికారతపై ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. రాజ్యాంగంలో మహిళా శక్తి కీలక పాత్ర పోషించిందని ప్రధాని మోదీ అన్నారు. చాలా దేశాలు మహిళలకు ఓటు హక్కును చాలా ఆలస్యంగా ఇచ్చాయని, అయితే భారతదేశంలో రాజ్యాంగం మొదటి నుండి మహిళలకు ఈ హక్కును కల్పించిందని ఆయన గుర్తు చేశారు. భారత ప్రజాస్వామ్యం ప్రపంచానికి స్ఫూర్తిదాయకమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు . అందుకే భారతదేశాన్ని ప్రజాస్వామ్య మాతగా పిలుస్తారు. మనది పెద్ద ప్రజాస్వామ్యం మాత్రమే కాదు. మనం ప్రజాస్వామ్యానికి తల్లి వంటిదని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.

# రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి అమలు.



**న్యూఢిల్లీ:** రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి ఉండాలని వీడీ సావర్కర్ చెబితే ఇప్పుడు బీజేపీ నేతలు రాజ్యాంగాన్ని రక్షిస్తామని అనడం విడ్డూరంగా ఉందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. రాజ్యాంగంపై లోక్‌సభలో జరుగుతున్న చర్చలో రాహుల్ పాల్గొన్నారు. రాజ్యాంగంలో అసలు భారతీయతే లేదనీ, దాని స్థానంలో మనుస్మృతి ఉండాలని ఆర్?ఎస్ఎస్, బీజేపీ సిద్ధాంతకర్త వీడీ సావర్కర్ చెప్పిన మాటలను రాహుల్ గుర్తు చేశారు. ఏకలవ్యుడి బొటనవేలిని ద్రోణుడు నరికించినట్లే అదానీ, అంబానీ లాభం కోసం చిన్న వ్యాపారుల వేలిని బీజేపీ కత్తిరించిందని రాహుల్ వ్యాఖ్యానించారు. అగ్నివీర్, ప్రశ్నపత్రాల లీక్‌ల ద్వారా యువత బొటనవేలిని కత్తిరించారని మండిపడ్డారు. మద్దతుధర కోసం ఉద్యమిస్తున్న రైతుల బొటనావేలిని కత్తిరించారని దుయ్యబట్టారు. సామాజిక, ఆర్థిక సమానత్వం లేకుంటే రాజకీయ సమానత్వం ఉండదని అంబేడ్కర్ చెప్పారన్న రాహుల్, కులగణనతో సమానత్వం వైపు అడుగులేస్తామని తెలిపారు. మతం, జాతి, కులం, లింగం లేదా జన్మస్థలం ఆధారిత వివక్షను నిషేధించాలని రాజ్యాంగం చెబితే బీజేపీ మాత్రం విద్వేషాన్ని వ్యాప్తి చేస్తోందని తెలిపారు. మనుస్మృతి వంటి ప్రాచీన విధానాలతోనే దేశం నడవాలని బీజేపీ కోరుకుంటోందని ఆరోపించారు. రాజ్యాంగం గురించి, భారతదేశాన్ని ఎలా నడపాలని ఆర్ఎస్ఎస్ సుప్రీం లీడర్ సావర్కర్ భావించారో చెబుతూ నా ప్రసంగాన్ని ప్రారంభించాలనుకుంటున్నాను. "రాజ్యాంగంలో చెత్త విషయం ఏమిటంటే, దానిలో భారతీయత ఏమీ లేదు. మనుస్మృతి అనేది మన హిందూ దేశానికి వేదాల తర్వాత అత్యంత పూజనీయమైనది. మన ప్రాచీన కాలం నుంచి మన సంస్కృతి, ఆచారాలు, ఆలోచనలు, ఆచరణలకు ఆధారమైంది." ఇవి సావర్కర్ చెప్పిన మాటలు. సావర్కర్ తన రచనల్లో మన రాజ్యాంగంలో భారతీయత ఏమీ లేదని స్పష్టంగా చెప్పారు. రాజ్యాంగాన్ని మనుస్మృతితో భర్తీ చేయాలని ఆయన చెప్పారు. దానికి వ్యతిరేకంగానే మేం పోరాటం చేస్తున్నామన్నారు. మరోవైపు, భారత్‌లో అందరికీ సమాన ఓటు హక్కు ఉన్నప్పటికీ ఇక్కడ మైనారిటీలకు ఎలాంటి హక్కులు ఉండడం లేదని దుష్ప్రచారం చేయడం సరికాదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజూ విపక్షాలకు హితవు పలికారు. 75 ఏళ్ల రాజ్యాంగ ప్రస్తానంపై లోక్‌సభలో జరుగుతున్న చర్చలో మాట్లాడిన రిజిజూ మైనారిటీల సంక్షేమం కోసం కాంగ్రెస్‌తోపాటు %చీణాూ% ప్రభుత్వాలు కూడా ఎంతో కృషి చేశాయని చెప్పారు. ఇప్పుడు విపక్షాలు వారి వ్యాఖ్యలతో అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్ఠను దిగజార్చవద్దని హితవు పలికారు. భారత్‌లో మైనారిటీలకు చట్టబద్ధమైన భద్రత ఉందన్న మంత్రి ప్రభుత్వం ఆ నిబంధనకు కట్టుబడి ఉందని వివరించారు. ఐరోపా దేశాల్లో 48 శాతం మైనారిటీలు, ముఖ్యంగా ముస్లింలు వివక్ష ఎదుర్కొంటున్నారని ఒక సర్వేలో తేలిందన్నారు. ఫ్రాన్స్, స్పెయిన్ దేశాల్లో బురా?లు ధరించిన ముస్లింలపై అభ్యంతరం వ్యక్తం అవుతోందని గుర్తుచేశారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌లోని సిక్కులు, హిందువులు, క్రైస్తవుల పరిస్థితి ఎలా ఉందో అందరికీ తెలిసిందేనని వివరించారు. టిబెట్‌లో అయినా మయన్మార్, శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్థాన్, అఫ్గానిస్థాన్‌లో అయినా- మైనారిటీల పట్ల అణచివేత జరిగితే, వారికి ఏదైనా కష్టం వస్తే వారు రక్షణ పొందేందుకు మొదట వచ్చే దేశమేదైనా ఉందంటే అది భారతదేశమే. ఇది సురక్షితం కాబట్టే ఇక్కడకు వస్తారు. అలాంటప్పుడు ఈ దేశంలో మైనారిటీలకు భద్రత లేదని ఎలా అంటారు ? మైనారిటీ, మెజారిటీ వ్యక్తుల మధ్య, ప్రతీ ఇంట్లో ప్రతీ కుటుంబంలో చిన్న చిన్న గొడవలు రావడం సహజం. అంతమాత్రాన దేశ ప్రతిష్టను దెబ్బతీసే మాటలు మాట్లాడకూడదు. ఒక పార్టీ కోసం ఈ మాట చెప్పడం లేదు, దేశం కోసం చెబుతున్నారాణి అన్నారు.

# దేశానికే ఆదర్శంగా కులగణన

**హైదరాబాద్:** కాంగ్రెస్? ప్రభుత్వం ఇస్తున్న గ్యారెంటీలు పేదలకే అందుతున్నాయని సీఎం రేవంత్? రెడ్డి తెలిపారు. అమ్మలా ఉండే తెలంగాణ తల్లినే తెచ్చుకున్నామని అన్నారు.. ఆ విగ్రహం మన అమ్మకు, అక్కకు ప్రతిరూపమని పేర్కొన్నారు. దేశానికే ఆదర్శంగా కులగణన చేపడుతున్నామని వివరించారు. 98 శాతం కులగణన జరిగిందని వెల్లడించారు. హైదరాబాద్?లోని కోకాపేట్?లో కురుమ భవన ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కురుమల నిజాయితీని, గొప్పతనాన్ని ముఖ్యమంత్రి కొనియాడారు. కురుమలు అత్యంత నమ్మకస్తులని తాను ఎప్పుడూ చెబుతూ ఉంటానని, ఊళ్లో భూమి అమ్ముకోవాలంటే ముందు కురుమలకు అమ్ముకోవాలని చెబుతుంటానని తెలిపారు. పార్లమెంటులో కూడ కురుమ సోదరుల ప్రాతినిధ్యం పెంచుతామని చెప్పారు."కురుములకు భూమి అమ్మితే డబ్బు నడుముకు కట్టుకుని తెచ్చి ఇస్తారు.. వారు ఇచ్చిన డబ్బును లెక్కపెట్టుకోవాల్సిన అవసరం లేదు. దొడ్డి కొమురయ్య ఆనాడు రైతాంగ పోరాటంలో తెగువ చూపారు. దొడ్డి కొమురయ్య రైతాంగ పోరాటాన్ని ముందుండి నడిపారు. కురుమలు తెలంగాణ పునర్?నిర్మాణంలో భాగస్వాములు కావాలనేది ప్రభుత్వ కోరిక. ఈ కురుమ భవనం విద్యకు వేదిక కావాలని అన్నారు. కురుమలకు, యాదవులకు రెండేసి చొప్పున ఎంపీ సీట్లు ఇచ్చామని ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి గుర్తు చేశారు. కురుమలను గెలిపించుకోవాల్సిన బాధ్యత వారిపైనే ఉందన్నారు. గెలవకపోతే టికెట్లు ఎందుకు ఇచ్చారని ప్రశ్నలు వస్తాయని చెప్పారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య కురుమ వర్గానికి చెందిన వ్యక్తినేనని సీఎం రేవంత్? రెడ్డి తెలిపారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎట్టిపరిస్థితుల్లో ఎస్సీ కులాలకు అన్యాయం చేయనని, రిజర్వేషన్ల విషయంలో అందరికీ న్యాయం చేసే బాధ్యత తనదేనని తెలిపారు. హైదరాబాద్ లోని హొటల్ దసపల్లాలో గ్లోబల్ మాదిగ డే %-% 2024 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తరాల నుంచి ఎస్సీ వర్గీకరణ కోసం ఓ వర్గం చేస్తున్న పోరాటానికి మద్ధతుగా.. ఇటీవల సుప్రీం కోర్టు నుంచి సానుకూల తీర్పు వెలువడింది. దానిని ప్రస్తావించిన సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సుప్రీంకోర్టులోని మాదిగ ఉపకులాల రిజర్వేషన్ల కేసులో బలమైన వాదనలు వినిపించినట్లు వెల్లడించారు. ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ లో కాంగ్రెస్ పార్టీ మాదిగ కుల ఉపకులాల రిజర్వేషన్లపై స్పష్టమైన విధానాన్ని తెలియజేసిందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై ఎన్నికల సమయంలోనే తమ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టమైన ప్రకటన చేశారని గుర్తు చేసిన సీఎం రేవంత్ రెడ్డి.. మాదిగలకు సంబంధించి అనుకూల నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు దానంతట అదే రాలేదని వ్యాఖ్యానించిన సీఎం రేవంత్ రెడ్డి.. మాదిగలకు అనుకూలంగా తీర్పు రావటంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ గారి నేతృత్వంలో ప్రత్యేకంగా న్యాయవాదులను నియమించి వాదనను వినిపించినట్లు తెలియజేశారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు విలువరించటంతో ఇక రాష్ట్ర ప్రభుత్వం సైతం ఆ తీర్పును తూచా తప్పకుండా అమలు చేస్తుందని శాసనసభ వేదిక ప్రకటించినట్లు సీఎం తెలిపారు. తెలంగాణ సమస్యలానే ఎస్సీ వర్గీకరణ సమస్యను జఠిలంగా మారిపోయిందన్న సీఎం రేవంత్ రెడ్డి.. ప్రజల ఆకాంక్ష మేరకు ప్రభుత్వాలు నిర్ణయం తీసుకుని అమలు చేయాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. తరాలుగా మాదికలు ఆకాంక్షిస్తున్నట్లుగా రిజర్వేషన్ల వర్గీకరణ అంశంలో న్యాయం ఉందని.. వారికి న్యాయం చేయాలని ఆలోచన తమ ప్రభుత్వానికి ఉందని తెలిపారు. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణను అమలు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే కార్యచరణ మొదలుపెట్టిందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా వర్గీకరణను అమలు చేసేందుకు చేపట్టాల్సిన విధివిధానాలు పై అధ్యయనం చేసేందుకు అధ్యయనం చేస్తున్నామని, అందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించినట్లు తెలియజేశారు. 60 రోజుల్లో నివేదిక ఇవ్వాలని జ్యూడిషియల్ కమిషన్ సైతం నియమించినట్లు వెల్లడించారు. మరో వారం రోజుల్లో నివేదిక వచ్చే అవకాశం ఉందని, దాని ఆధారంగానే ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం మాదిగ కులస్తులు అడగకుండానే ప్రభుత్వంలో మంచి అవకాశాలు కల్పిస్తున్నామన్న సీఎం రేవంత్ రెడ్డి.. సీఎం పేషీలో ఆ సామాజిక వర్గం వాళ్లు ఉండాలనే ఉద్దేశ్యంతోనే డాక్టర్ సంగీతను నియమించినట్లు తెలిపారు. వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఉస్మానియా యూనివర్శిటీలో ఎన్నడూ లేనివిధంగా వైస్ ఛాన్స్ లర్ గా ఈ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని నియమించినట్లు తెలిపారు. %××ు% వీసీగా, విద్యా కమిషన్ మెంబర్ గా, ఉన్నత విద్యా శాఖలో మాదిగ సామాజిక వర్గానికి అవకాశం కల్పించామంటూ ప్రకటించారు.

# కేసు విషయంలో ఎన్నో మాట్లాడాలని ఉన్నా

**హైదరాబాద్:** తనపై నమోదైన కేసుకు సంబంధించి అనేక విషయాలు మాట్లాడాలని ఉన్నా, కోర్టు ఆదేశాల మేరకు మాట్లాడలేకపోతున్నట్లు అల్లు అర్జున్ స్పష్టం చేశారు. సంధ్య థియేటర్ వద్ద విషాదకర సంఘటన జరగడం పట్ల మరోసారి బాధిత కుటుంబానికి క్షమాపణలు చెప్పిన ఆయన, త్వరలోనే ఆ కుటుంబాన్ని కలుస్తానని వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి తనకు మద్దతు ఇస్తున్న వారందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇవాళ ఉదయం చంచల్‌గూడ జైలు నుంచి విడుదలైన అల్లు అర్జున్, జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. తనపై చూపించిన ప్రేమ, అభిమానానికి అభిమానులకు, దేశవ్యాప్తంగా మద్దతిచ్చిన మీడియాకు కృతజ్ఞతలు చెబుతున్నానంటూ అల్లు అర్జున్ పేర్కొన్నారు. సంధ్య థియేటర్‌లో జరిగింది అనుకోని ఘటన అని, అందులో తన ప్రమేయం లేదని స్పష్టం చేశారు. గత 20 ఏళ్లుగా సంధ్య థియేటర్‌కు వెళ్తున్నానని, ఇప్పటి వరకు 30 సార్లు సంధ్య థియేటర్‌కు వెళ్లినట్లు తెలిపారు. ఇలాంటి దుర్ఘటన ఎప్పుడూ జరగలేదని అన్నారు. మరోవైపు జైలు నుంచి ఇంటికి చేరుకున్న అల్లు అర్జున్?కు ప్రముఖుల నుంచి పరామర్శలు వెల్లువెత్తుతున్నాయి. నందమూరి బాలకృష్ణ స్వయంగా అల్లు అరవింద్?కు ఫోన్ చేసి అల్లు అర్జున్?తో మాట్లాడి పరామర్శించారు. ఈ మేరకు కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. 'పుష్ప' దర్శక నిర్మాతలతో పాటు హీరోలు విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, రానా, నాగచైతన్య, సుధీర్ బాబు, దర్శకులు రాఘవేంద్రరావు, కొరటాల శివ, వంశి పైడిపల్లి, బి.గోపాల్?, ఆర్. నారాయణమూర్తి, నిర్మాతలు సురేశ్? బాబు, దిల్ రాజు, బీవీఎన్?ఎస్ ప్రసాద్, సంగీత దర్శకుడు తమన్ సహా పలువురు సన్నిహితులు, మాజీ మంత్రులు గంటా



శ్రీనివాసరావు, అవంతి శ్రీనివాస్?లు అల్లు అర్జున్?ను కలిసి మద్దతు ప్రకటించారు. కాసేపు అల్లు అరవింద్, అల్లు అర్జున్?లతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ముఖ్యంగా చిరంజీవి సతీమణి సురేఖ అల్లుఅర్జున్ నివాసానికి చేరుకోగానే సోదరుడు అల్లు అరవింద్ దగ్గరుండి బన్నీ వద్దకు తీసుకెళ్లారు. తనను హత్తుకొని సురేఖ ఒకింత భావోద్వేగానికి గురికావడంతో అల్లు అర్జున్ కళ్లు చెమ్మగిల్లాయి. ఇలా సినీ, రాజకీయ ప్రముఖులు, సన్నిహితులతో అల్లు అర్జున్ నివాసం వద్ద సందడి నెలకొంది. మరోవైపు అభిమానులు ఎవరూ అర్జున్ నివాసానికి రాకుండా పోలీసులు మూడు వైపుల బారికెడ్లు ఏర్పాటు చేసి భారీ బందోబస్తు నిర్వహించారు. అల్లుఅర్జున్ అరెస్టుపై యావత్ చిత్ర పరిశ్రమ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. అరెస్టును ఖండిస్తూ పలువురు నటీనటులు తమ అభిప్రాయాలను, అభ్యంతరాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. సినిమా వాళ్లకు సంబంధించిన ఏ విషయంలోనైనా ప్రభుత్వ అధికారులు, మీడియా చూపించే ఉత్సాహం సాధారణ పౌరులపై కూడా ఉండాలని కోరుకుంటున్నట్లు నాని తెలిపారు. మంచి సమాజంలో జీవించాలన్నారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటన దురదృష్టకరమని, ఆ ఘటన నుంచి పరిశ్రమ ఎన్నో పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. ఈ ఘటనలో ఒక వ్యక్తిని నిందించడం సరైనది కాదని నాని అభిప్రాయపడ్డారు. బాలీవుడ్ నటుడు వరుణ్ ధావన్ కూడా ఇదే అంశంపై ఓ సినీ వేడుకలో పరోక్ష వ్యాఖ్యలు చేశారు. భద్రతాపరమైన, ఇతర అంశాలను నటీనటులు ఒక్కరే చూసుకోలేరని, జాగ్రత్తగా ఉండాలని మాత్రమే వాళ్ల చుట్టుపక్కల వారికి సూచిస్తుంటారని వరుణ్ ధావన్ తెలిపారు. ఈ విషయంలో ఒక వ్యక్తిని మాత్రమే నిందించడం అన్యాయమన్నారు. పుష్ప-2 కథానాయిక రష్మిక కూడా బన్నీ అరెస్టుపై ఆవేదన వ్యక్తం చేసింది. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను తాను నమ్మలేకపోతున్నానని, సంధ్య థియేటర్ వద్ద దురదృష్టకరమని, ఆ ఘటన తన హృదయాన్ని కలచివేస్తుందని పేర్కొంది. అదే సమయంలో ఒకే వ్యక్తిని నిందించడం సబబు కాదని అల్లు అర్జున్‌కు రష్మిక తన మద్దతు ప్రకటించింది. థియేటర్ల వద్ద తొక్కిసలాట ఘటన బాధాకరమన్న నటుడు నితిన్ ఈ ఘటనను తప్పుపట్టడం కంటే దాన్ని నుంచి పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. మరో కథానాయకుడు సందీప్ కిషన్ కూడా బన్నీ అరెస్టును తప్పుపట్టారు. ఊహించని ఘటనలో ఒకే వ్యక్తి ఎలా బాధ్యత వహించగలరని ప్రశ్నించారు. దర్శకుడు అనిల్ రావిపూడి కూడా స్పందిస్తూ సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటన మెరుగైన భద్రత అవసరాలను గుర్తు చేస్తుందన్నారు. ఇలాంటి ఘటనలు పురావృతం కాకుండా చూసుకుందామని పిలుపునిచ్చిన అనిల్, బాధిత కుటుంబాన్ని ఆదుకోవడంలో అర్జున్ బాధ్యతాయుతంగా వ్యవహరించారన్నారు. అలాంటి వ్యక్తిని ఒక్కరినే బాధ్యత వహించమనడం సరైన నిర్ణయం కాదని అనిల్ అభిప్రాయపడ్డారు. మరో దర్శకుడు అజయ్ భూపతి అల్లు అర్జున్ అరెస్టును ఖండించారు.

## మళ్లీ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్న బాబు

**అమరావతి:** విజన్ 2047 పేరుతో చంద్రబాబు మళ్లీ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని.. ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ దశ - దిశ మారాలంటే తక్షణం కావాల్సింది విజన్లు కాదు.. విభజన హామీలు అని వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని నెంబర్ 1గా నిలపాలంటే నెరవేరాల్సింది కేంద్రం ఇచ్చిన హామీలని స్పష్టం చేశారు. దశాబ్ద కాలంగా విభజన హామీలను గాలికి వదిలేశారు.. పూర్తిగా అటకెక్కించారని ఫైర్ అయ్యారు'రాష్ట్ర విభజన సమయంలో అనాడు యూపీఏ సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా హామీ ఇచ్చింది. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చింది. నూతన రాజధానికి పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం ఇవ్వాలని సూచించింది. బుందేల్ ఖండ్ తరహాలో వెనుక బడిన జిల్లాలకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటన చేసింది. మౌలిక సదుపాయాల కల్పన, పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని షెడ్యూల్ 13 లో పొందపరించింది' అని షర్మిల వివరించారు. 'కడప స్టీల్, దుగ్గరాజుపట్నం పోర్టులను నిర్మిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం విభజన చట్టంలో పొందపరించింది. నూతన రైల్వే జోన్, పెట్రోలియం యూనివర్సిటీ, విశాఖ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, విజయవాడ, విశాఖలో మెట్రో రైల్, హైదరాబాద్ నుంచి విజయవాడకు ర్యాపిడ్ రైల్, ఇలా ఎన్నో హామీలు నేటికీ కలగానే మిగిలాయి. ఇవ్వాల్టికి ఒక్క హామీకి దిక్కులేకుండా పోయింది' అని షర్మిల ట్వీట్ చేశారు. 'గడిచిన 10 ఏళ్లలో ప్రత్యేక హోదా వచ్చి ఉంటే పన్నుల్లో రాయితీలు ఉండేవి. వేల సంఖ్యలో కొత్త పరిశ్రమలు వచ్చేవి. లక్షల్లో ఉపాధి అవకాశాలు లభించేవి. పోలవరం ప్రాజెక్టు పూర్తి అయ్యి ఉంటే రాష్ట్రం సస్యశ్యామలం అయ్యేది. విజయవాడ, విశాఖలో మెట్రో రైల్ నిర్మాణం జరిగితే ప్రధాన నగరాలుగా అభివృద్ధి చెందేవి. వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీలు అంది వుంటే పేదరిక నిర్మూలన సాధ్యం అయ్యేది. విభజన హామీలు అమలయ్యి ఉంటే రాష్ట్రం దిశ - దశ పూర్తిగా మారేది. దేశంలో నెంబర్ 1 రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ విరాజిల్లేది' అని షర్మిల వ్యాఖ్యానించారు. విభజన చట్ట హామీలు బుట్టదాఖలు చేయడంలో ప్రధాన ముద్దాయి ప్రధాని నరేంద్ర మోదీ అయితే, రెండో ముద్దాయి చంద్రబాబు, మూడో ముద్దాయి జగన్ మోహన్ రెడ్డి. ఈ ముగ్గురు కలిసి రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారు. హోదా 5 ఏళ్లు కాదు 10 ఏళ్లు ఇస్తామని మోదీ నమ్మబలికితే.. హోదా ఏమైనా సంజీవనా అని చంద్రబాబు చెవుల్లో పూలు పెట్టారు'.

# జగన్ ఆస్తుల కేసులో కీలక పరిణామం

మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆయన కేసులకు సంబంధించిన వివరాలతో కూడిన నివేదికను సుప్రీం కోర్టుకు సీబీఐ, ఈడీ అందజేశాయి. ఆ నివేదికను పరిశీలించిన తరువాతే తీర్పు ఇస్తామని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. అనంతరం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసుల బదిలీ, బెయిల్ రద్దు పిటిషన్లపై విచారణ జనవరి 10 వాయిదా పడింది.

వైఎస్ జగన్మోహన్ రెడ్డి కేసుల విచారణలో జాప్యంపై అఫిడవిట్ రూపంలో నివేదికను సీబీఐ, ఈడీ దాఖలు చేశాయి. కేసుల జాప్యానికి గల కారణాలను అఫిడవిట్‌లో దర్యాప్తు సంస్థలు వివరించాయి. వైఎస్ జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసుల విచారణ ఆలస్యం అవుతోందని%ౖౌ% వేగవంతంగా ట్రయల్ పూర్తి చేసేందుకు తెలంగాణ నుంచి మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు పిటిషన్ దాఖలు చేశారు. అలాగే ఆయన బెయిల్‌ను రద్దు చేయాలని.. లేకపోతే కేసుల విచారణపై తీవ్ర ప్రభావం పడుతుందని మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లను శుక్రవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్ కూడిన ధర్మాసనం విచారించింది. సీబీఐ, ఈడీ తరపు న్యాయవాది అడిషనల్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) రాజ్‌కుమార్ భాస్కర్ ఠాక్రే వాదనలు వినిపిస్తూ సీబీఐ, ఈడీ కేసుల స్టేటస్ వివరాలు గురువారం సాయంత్రం ఫైల్ చేసినట్లు ధర్మాసనానికి తెలిపారు. దర్యాప్తు సంస్థలు దాఖలు చేసిన స్టేటస్ రిపోర్ట్ కాపీ తాము పరిశీలిస్తామని ధర్మాసనం తెలిపింది. తాము కూడా పరిశీలించడానికి కొంత సమయం కావాలని వైఎస్ జగన్మోహన్ రెడ్డి తరపు సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి కోరారు. వైఎస్ జగన్ కేసుల విచారణలో ఎందుకు జాప్యం జరుగుతుందని గతంలో దర్యాప్తు సంస్థలను సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. కేసుల స్టేటస్‌ను వివరిస్తూ నివేదిక ఇవ్వాలని ఈనెల 2 (సోమవారం)న విచారణ సందర్భంగా దర్యాప్తు సంస్థలను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా ధర్మాసనం ఆదేశించింది.

# కాంగ్రెస్ నిర్లక్ష్యం గురుకుల పాలిట శాపం

హైదరాబాద్: విద్యార్థుల ఆరోగ్యాలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, తద్వారా విద్యార్థుల ప్రాణాలు సంకటంగా మారాయని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం.. గురుకుల విద్యార్థులకు శాపంగా మారిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. వికారాబాద్ జిల్లా తాండూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో అనారోగ్యం పాలై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని లీలావతిని హరీశ్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. వికారాబాద్ జిల్లా తాండూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఈ నెల 10న కిచిడీ తిని 15 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. మంచి ఆసుపత్రికి పంపకుండా హాస్టల్‌లో ఉంచి వారికి చికిత్స అందించారని పేర్కొన్నారు. నాలుగు రోజులు గడించినా అయినా వారు పూర్తి ఆరోగ్యవంతులు కాలేదు. విద్యార్థిని లీలావతిని నిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారని తెలిపారు. తోటి విద్యార్థులతో ఆడుతూ, పాడుతూ బడిలో పాఠాలు నేర్చుకోవాల్సిన ఆ చిన్నారి.. మౌనంగా ఇలా నిమ్స్ ఆసుపత్రి బెడ్‌పై ఉండటం చూస్తే మనసు కలిచివేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ విద్యార్థిని త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నానన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం అభం, శుభం తెలియని గిరిజన బిడ్డకు శాపంగా మారింది. తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగుల్చుతున్నది అని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. వాంకిడి గురుకుల విద్యార్థులకు చికిత్స అందించడంలో జరిగిన వైఫల్యం ఇక్కడ కనిపిస్తున్నది. మొన్న శైలజ మృతికి ప్రభుత్వం కారణం అయ్యింది. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో వరుస ఫుడ్ పాయిజన్లు జరిగి విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నట్టు? రాష్ట్ర వ్యాప్తంగా కాదు,
కనీసం సొంత జిల్లా ప్రభుత్వ పాఠశాలలు,
గురుకులాలను సైతం పట్టించుకోని నిర్లక్ష్యపు ముఖ్యమంత్రి ఈ రేవంత్ రెడ్డి. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ అభం శుభం తెలియని విద్యార్థులకు శాపం అవుతున్నదని ప్రాణాలను బలిగొంటుందని రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ని సార్లు చెప్పినా అర్థం కావడం లేదు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. విద్యా మంత్రి, ఎస్సీ, ఎస్టీ మంత్రి కూడా రేవంత్ రెడ్డి. ముఖ్యమంత్రి వద్ద ఉన్న శాఖల నిర్వహణలో వైఫల్యం. చూడడానికి వెళ్తే ప్రతిపక్ష నాయకులను అడ్డుకుంటారు. సబితా ఇంద్రా రెడ్డిని, సత్యవతి రాథోడ్‌ని అరెస్టు చేశారు. ఢిల్లీ పెద్దలను ప్రసన్నం చేసుకోవడంపై ఉన్న ధ్యాస, కనీసం జిల్లాలో ఉన్న పిల్లల భవిష్యత్తుపై లేదా? నిన్న నల్గొండ %-% కేతేపల్లి మండలం గురుకులంలో ఐదో తరగతి చదువుతున్న నీలం సాయి గణేష్ పాము కాటుకు గురయ్యాడు. ఆసుపత్రి పాలయ్యాడు. ఫుడ్ పాయిజన్ కేసులు, కుక్క కాట్లు, పాము కాట్లు, ఎలుక కాట్లు, కరెంటు షాక్‌లు నిత్య కృత్యం అవుతున్న ప్రభుత్వం ముద్దు నిద్ర వేడడం లేదు. ఇప్పటి వరకు 49 మంది విద్యార్థులు చనిపోతే ఉలుకు లేదు పలుకు లేదు అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# దేశవ్యాప్తంగా కుల గణన నిర్వహించాలి.






**చట్టసభల్లో బిసి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలి.**

**బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు) రాష్ట్ర అధ్యక్షులు నల్లా సూర్యప్రకాష్ డిమాండ్.**

**ఘనంగా బిఎల్ పి రాష్ట్ర ప్రథమ మహా సభలు ప్రారంభం.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 14:**



కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశవ్యాప్తంగా కుల గణన నిర్వహించి, బిసి కులాల జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు) బిఎల్ పి రాష్ట్ర అధ్యక్షులు నల్లా సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్ లో శనివారం బహుజన కమ్యూనిస్టు పార్టీ- బిఎల్ పి రాష్ట్ర ప్రథమ మహాసభలు ప్రారంబించారు. సభ ప్రారంభానికి ముందు అశోక చక్రం సుత్తి కొడవలితో కూడిన నీల్ లాల్ జెండాను ఆవిష్కరించారు. ఈ మహాసభలకు బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. సిద్ది రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎం గౌడ్, సబ్బని లతలు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నల్లా సూర్యప్రకాష్ మాట్లాడుతూ, దేశ జనాభాలో దాదాపు 65 శాతం ఉన్న బిసి కులాల ప్రజలు అసెంబ్లీ, పార్లమెంట్ లాంటి చట్టసభలకు ఎన్నికైతేనే ప్రస్తుత అసమానతల దోపిడి వ్యవస్థ నుండి అత్యంత సామాజిక అన్యాయానికి గురవుతున్న ఎంబిసిలు , సంచార జాతులు ఆర్థిక సామాజిక సాంస్కృతిక పరంగా విముక్తి చెందుతారని ఆయన అన్నారు. దేశ జనాభాలో దాదాపు 65 శాతం బిసి కులాల జనాభా ఉంటే అందులో మోస్ట్ బ్యాక్ వాడ్ క్లాసెస్ ఎంబిసి లు 39 శాతం ఉన్నారని అన్నారు. బీహార్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కుల గణన ద్వారా ఈ విషయం వెల్లడైందని ఆయన గుర్తు చేశారు. బహుజన కమ్యూనిస్టు పార్టీ బిఎల్ పి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ మాట్లాడుతూ, తెలంగాణలో బహుజన శ్రామిక వర్గ ప్రజాస్వామ్య ప్రత్యామ్నాయం నిర్మించడం ద్వారా మాత్రమే తెలంగాణ సమాజంలో 93శాతం ఉన్న బహుజన శ్రామిక వర్గ ప్రజలకు సామాజిక న్యాయం సమగ్రాభివృద్ధి స్వేచ్ఛా సమానత్వం సౌభ్రాతృత్వం పొందుతారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు) భావ సారూప్యత సోదర పార్టీలకు చెందిన నేతలు ఎంసిపిఐ యు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్, బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.పర్వతాలు, బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర రాష్ట్ర కోశాధికారి మారోజు సునీల్ కుమార్, రాష్ట్ర కమిటి సభ్యులు వడ్ల సాయి కృష్ణ, బి.హెచ్. కళా, అరుణ మహిముద్, ఎం. అంజనేయులు, ఎం. అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# మెస్ ఛార్జిలలో సగం వాటా కేంద్ర ప్రభుత్వానిదే.

**వసతి గృహాలలో మౌలిక సౌకర్యాల పైన రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలి.**

**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ డిమాండ్.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 14:**





మెస్ ఛార్జిలలో సగం వాటా కేంద్ర ప్రభుత్వానిదేనని, వసతి గృహాలలో మౌలిక సౌకర్యాల పైన రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ డిమాండ్ చేశారు. న్యాల్కల్ రోడ్ లోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని శనివారం అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, అడిషనల్ కలెక్టర్ అంకిత్ తో కలిసి సందర్శించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ మాట్లాడుతూ, గతంలో అర్బన్ లో వసతి గృహాలను సందర్శించిన సమయంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని, చాలి చాలని మెస్ ఛార్జిల వాళ్ళ విద్యార్థులు అర్ధాకలితో చదువులు కొనసాగించాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. అందువల్ల మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేయడం జరిగిందని, అందుకు అనుగుణంగా రాష్ట్రప్రభుత్వం వసతి గృహల డైట్ చార్జీలు 40 శాతం పెంచడం అభినందించదగ్గ విషయం అన్నారు. అయినా ప్రస్తుతం ఉన్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ఇంకో 20 శాతం పెంచే పునరాలోచన రాష్ట్ర ప్రభుత్వం చేయాలనీ విజ్ఞప్తి చేశారు.

గత ప్రభుత్వం హయాంలో సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి మురికి కుపాలుగా మారాయి అని, పురుగుల అన్నం తినాల్సిన పరిస్థితి ఉండేదని, నేటికీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కూడా ఎటువంటి మార్పు లేదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో ఆహార కల్తీతో అనేక మంది విద్యార్థులు ఆస్పత్రుల పాలు కావడం జరిగిందని, అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. నిజామాబాదు అర్బన్ లో ఉన్న వసతి గృహాలలో సరైన మౌలిక వసతులు లేవని విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారని, మౌలిక వసతుల కల్పనకు రాష్ట్రప్రభుత్వం తగిన నిధులు విడుదల చేయాలనీ డిమాండ్ చేసారు. వసతి గృహ విద్యార్థులకు బుక్స్ లేవని వార్డెన్, విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తేగా, తన ట్రస్ట్ ద్వారా బుక్స్ కు అయ్యే మొత్తాన్ని చెల్లిస్తాని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్, హాస్టల్ సిబ్బంది, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక..

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా అధికారులు సర్వే ప్రారభించారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి అధికారులు యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ నెలాఖరులోగా వివరాల నమోదు పక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం టార్గెట్‌గా పెట్టుకుంది.

తెలంగాణలో ఇండ్లు లేని పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేయనున్న సంగతి తెలిసిందే. ఈ పథకం లబ్ధిదారుల ఎంపిక కోసం.. ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్‌ను సైతం తీసుకొచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 80,54,554 దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి యాప్‌లో అధికారులు వివరాలు నమోదు చేస్తున్నారు. ప్రతి 500 దరఖాస్తులకు ఒక సర్వేయర్‌ను ఏర్పాటు చేశారు. ఒక సర్వేయర్ రోజుకు కనీసం 20 దరఖాస్తులను సర్వే చేయాలని టార్గెట్‌గా పెట్టారు. మున్సిపాలిటీల్లో సర్వేయర్లుగా.. వార్డు అధికారి, బిల్ కలెక్టర్, జూనియర్ అసిస్టెంట్, గ్రామీణ ప్రాంతాల్లో అయితే గ్రామ కార్యదర్శి, ఉపాధి హామీ సిబ్బందిని నియమిస్తున్నారు. ఈ నెలాఖరులోగా సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం డెడ్‌లైన్ విధించింది.

గ్రామాలు, వార్డుల్లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే గురించి ఒక రోజు ముందే అధికారులు సమాచారం ఇస్తున్నారు.



అధికారులు ఇళ్లకు వచ్చే సరికి సంబంధిత దస్త్రాలు సిద్ధం చేసుకొని ఉండాలని దరఖాస్తుదారుకు సూచిస్తున్నారు. ఇండ్ల కేటాయింపులో ముందుగా.. దివ్యాంగులు, అనాథలు, వితంతువులు, ట్రాన్స్‌జెండర్లు, ఒంటరి మహిళలు, సఫాయి కార్మికులు, ఆదివాసీలకు ప్రాధాన్యం ఇస్తామని రేవంత్ సర్కార్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. దరఖాస్తుదారు ఉంటున్న సొంత లేదా అద్దె ఇంటి ఫొటోలను మూడు చొప్పున తీసి అప్‌లోడ్ చేయనున్నారు. వారికున్న స్థలం వివరాలు సైతం సేకరిస్తున్నారు. వీటిపై ఇప్పటికే సర్వేయర్లకు శిక్షణ పూర్తయ్యింది. తొలి విడతలో స్థలం ఉండి ఇల్లు లేని పేదలకు ఇళ్లను అందించనున్నారు.

వచ్చే నాలుగేళ్లలో తెలంగాణలో 20 లక్షల మంది పేదల సొంతింటి కలను నిజం చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఈ ఏడాది 4.5 లక్షల ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా 80 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. యాప్ ద్వారా వీరిలో అర్హులను గుర్తిస్తున్నామని.. ఇప్పటికే తెలంగాణ వ్యాప్తంగా 3.3 లక్షల మంది వివరాలు సేకరించినట్లు వెల్లడించారు. పేదల్లోనూ అతి పేదలను గుర్తించి ఇళ్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. వివిధ దశల్లో నిర్మాణాలకు యాప్ ద్వారా సేకరించిన సమాచారంతోనే బిల్లుల చెల్లింపు ప్రక్రియ ఉంటుందని అన్నారు.

# విద్యార్థులు ఎగిరిగంతేసే వార్త..



తెలంగాణలో గత కొంతకాలంగా గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ ఘటనలు వెల్లువెత్తుతున్నాయి. చాలా మంది విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతుండగా.. ఓ అమ్మాయి ప్రాణాలు కూడా పోవటం.. అందరినీ ఆందోళనకు గురిచేసింది. ఈ క్రమంలోనే.. ప్రభుత్వం హాస్టళ్ల తనిఖీ కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగానే.. విద్యార్థులకు పెట్టే భోజనం మెనూను ప్రభుత్వం మార్చింది. ఎప్పుడూలేని విధంగా విద్యార్థులకు భోజనంలో మటన్ అందించాలని నిర్ణయించింది.

తెలంగాణ విద్యార్థులకు రేవంత్ రెడ్డి సర్కార్ ఎగిరిగంతేసే వార్త వినిపించింది. ప్రస్తుతం.. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న గురుకులాలు, హాస్టళ్లు, విద్యాసంస్థల్లో కలుషిత ఆహారం తిని ఫుడ్ పాయిజన్ అవుతున్న ఘటనలు.. తరచూ వెలుగు చూస్తున్న నేపథ్యంలో.. సంక్షేమ హాస్టళ్లపై రేవంత్ రెడ్డి సర్కార్ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలోనే.. తనిఖీల పేరుతో హాస్టళ్ల బాటపట్టింది. రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లలో పరిస్థితులను స్వయంగా పర్యవేక్షించేందుకు.. ముఖ్యమంత్రి, మంత్రులతో పాటు ప్రభుత్వ యంత్రాంగం అంతా హాస్టళ్లు, గురుకులాల్లో తనిఖీలు చేపట్టారు. విద్యార్థులతో మాట్లాడి వాళ్ల సమస్యలు తెలుసుకున్నారు. అంతేకాకుండా.. వాళ్లతో కలిసి భోజనాలు కూడా చేశారు.

ఈ క్రమంలో.. విద్యార్థలకు పోషకాహారంతో పాటు, రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించడంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఇప్పటి వరకు అమలవుతున్న డైట్‌లో పలు మార్పులు చేసింది. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేలా ఈ మేరకు ప్రత్యేక మెనూ సిద్ధం చేసింది ప్రభుత్వం. ప్రభుత్వ హాస్టళ్లలో ఇప్పటి వరకు ప్రతి ఆదివారం చికెన్ పెడుతున్న విషయం తెలిసిందే. కాగా.. తొలిసారిగా విద్యార్థులకు మటన్ పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రత్యేక మెనూ ప్రకారం.. ఇకపై విద్యార్థులకు లంచ్‌లో నెలలో రెండు సార్లు మటన్‌తో పాటు నాలుగు సార్లు చికెన్ పెట్టనున్నారు. నాన్‌వెజ్ భోజనం పెట్టినప్పుడు సాంబార్, పెరుగు కూడా పెట్టాలని నిర్ణయించారు. నాన్‌వెజ్ తినని వారికి ఆ రోజుల్లో మీల్ మేకర్ కర్రీ కూడా వండనున్నారు. అయితే.. నాన్‌వెజ్ లేని మిగతా రోజుల్లో లంచ్‌లో ఉడికించిన గుడ్డు లేదా ఫ్రైడ్ ఎగ్ ఇవ్వనున్నట్టు సమాచారం.

ఈ హాస్టళ్ల తనిఖీ కార్యక్రమంలో భాగంగా.. రంగారెడ్డి జిల్లా చిల్కూర్‌లో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌ను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. అక్కడి నుంచే.. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో కామన్ డైట్ ప్లాన్ రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం.. విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి పిల్లల సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు.

ప్రైవేట్ స్కూళ్లు వచ్చాక గురుకులాల ప్రభావం తగ్గిందని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. గురుకులాల ప్రక్షాళన కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పదేళ్లుగా బీఆర్ఎస్ సర్కారు డైట్ ఛార్జీలు పెంచలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చాక గురుకులాల డైట్ ఛార్జీలు పెంచామని వెల్లడించారు.

# సామ్రాజ్యవాద "యుద్ధ సంస్కృతి" పై ఐక్యంగా ఉద్యమించాలి.

**ప్రజా ఉద్యమాల్లో 'అరుణోదయ'ది కీలక పాత్ర.**

**ఏసిఎఫ్ 50 వసంతాల ప్రారంభ సభలో ప్రజా గాయకురాలు విమలక్క పలువురు వక్తల పిలుపు.**









**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్, డిసెంబర్ 14:**






సామ్రాజ్యవాద "యుద్ధ సంస్కృతి" పై ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని ప్రజా గాయకురాలు విమలక్క తో పాటు పలువురు వక్తలు పిలుపునిచ్చారు.

ప్రజా ఉద్యమాల్లో 'అరుణోదయ' సాంస్కృతిక సమాఖ్య గత 50 ఏళ్లుగా ప్రజలను చైతన్యం చేస్తూ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య యాభై వసంతాల సభలు హైదరాబాద్ లో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సభకు ముందుగా వందల మంది కళాకారులతో బాగ్ లింగంపల్లిలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం వీఎస్టీ భవన్ లో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీఎఫ్ గౌరవాధ్యక్షురాలు విమలక్క మాట్లాడుతూ... "1974లో హైదరాబాద్ లో జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ చొరవతో ప్రారంభమైన అరుణోదయ సాంస్కృతిక వేదిక తెలంగాణ రైతాంగ పోరాటం నుంచి మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు తనదైన పాత్ర పోషించిందని అన్నారు. మతోన్మాదం. సారా వ్యతిరేక ఉద్యమం, ఆదివాసీల హక్కులు, మహిళా సమస్యలపై ప్రజలను చైతన్యం చేసిందని పేర్కొన్నారు.

మున్ముందు సామ్రాజ్యవాద యుద్ధ సంస్కృతి, ఆధిపత్యవాదంపై పోరా టాలే లక్ష్యంగా పని చేస్తుందని అన్నారు.ముఖ్యఅతిథిగా హాజరైన ఢిల్లీకి చెందిన ఆచార్యుడు జ్ఞాన ఆలోషియస్ మాట్లాడుతూ, దేశంలో పోరాట, ఉద్యమ చరిత్ర ఉన్న ఏ సంస్థా అరుణోదయ మాదిరిగా 50 ఏళ్లు నిలదొక్కుకోలేదన్నారు. తెలంగాణ ఉనికిలోనే ఉద్యమం ఉందని అన్నారు. ప్రముఖ పాత్రికేయుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉద్యమాలకు ముందుకు వచ్చే యువత సంఖ్య తగ్గిపో తోందని, విప్లవాల పురిటిగడ్డ తెలంగాణలో గతానికి భిన్న మైన ఘటనలను చూస్తున్నాం అని అన్నారు. కులాంతర వివాహం చేసుకున్నారని చంపేస్తున్నారని, ప్రశ్నించే వారిపై అర్బన్ నక్సల్స్ ముద్ర వేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. సభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ఆచార్య ఆచార్య జయధీర్ తిరుమలరావు మాట్లాడుతూ, నియంతృత్వం అనేది మన చుట్టూ కులం రూపంలో, జాతీయ స్థాయిలో మతం రూపంలో ఉందని అన్నారు. ప్రజలను చైతన్యం చేసే విధంగా మరింతగా అరుణోదయ సాంస్కృతిక కార్యక్రమాలు ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఏసీఎఫ్ కార్యదర్శి మల్లూర్, ఏపీ అధ్యక్షుడు బోయ సుంకులు, కార్యదర్శి సుధాకర్, ఆచార్య నాగేశ్వర్, ఆచార్య కట్టా భగవంత్ రెడ్డి, ఆచార్య కొల్లాపురం విమల, పిడిఎస్ యు నాయకులు విజయ్, పాల్గొన్నారు.

వేగుచుక్క

# నకిలీ కరెన్సీ తయారీ ముఠా అరెస్ట్.



**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, డిసెంబర్ 14:**

నకిలీ కరెన్సీ తయారు చేసి, చలామణి చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి లక్షల విలువ చేసే రూ.500 నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఎస్పీ సింధూశర్మ వివరాలు వెల్లడించారు. బాన్సువాడ పోలీసులు శుక్రవారం కొయ్యగుట్ట వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి కొందరు పారిపోతుండగా వారిని పట్టుకున్నారు. వారి వద్ద రూ.30 లక్షల విలువ చేసే రూ.500 నోట్ల నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నాట్టు తెలిపారు. తెలంగాణ, రాజస్థాన్, కర్ణాటక, ఉత్తరాఖండ్, మహారాష్ట్రకు చెందిన 8 మంది ముఠాగా ఏర్పడి దందాకు పాల్పడుతున్నారని అన్నారు. వీరిలో తెలంగాణకు చెందిన రాజగోపాల్, కర్ణాటకకు చెందిన హుసేన్ పీరా నకిలీ నోట్లు తయారీ, చలామణిలో పెట్టుబడి పెట్టారు. కామారెడ్డి జిల్లాకు చెందిన కిరణ్ కుమార్, రమేశ్ గౌడ్, మహారాష్ట్రకు చెందిన అజయ్, ఈశ్వర్ నకిలీ నోట్లు చలామణి చేస్తున్నారని వివరించారు. హైదరాబాద్ లోని బోయిన్ పల్లిలో రూ.60 లక్షల రూ.500 నకిలీ నోట్లు ప్రింటింగ్ చేశారని, ఇందులో రూ.3లక్షలు బిచ్కుందకు చెందిన కిరణ్ కుమార్, బాన్సువాడకు చెందిన రమేశ్ గౌడ్ కు అప్పగించారని అన్నారు. వారు వాటిని చుట్టుపక్కల గ్రామాల్లో చలామణి చేశారని అన్నారు. మరో రూ.30 లక్షలను ఇవ్వడానికి హైదరాబాద్ నుంచి రాజగోపాల్ బాన్సువాడకు వచ్చాడని, అతడిని బాన్సువాడ బస్టాండులో దింపడానికి కిరణ్ కుమార్, రమేశ్ గౌడ్ లు కారులో బయలు దేరాగా.. కొయ్యగుట్ట వద్ద పోలీసులకు పట్టుబడ్డారని ఎస్పీ తెలిపారు. రూ.30 లక్షలు స్వాధీనం చేసుకున్న పోలీసులు.. నిందితుల సమాచారం మేరకు హైదరాబాద్ లో తనిఖీలు చేపట్టి మిగతా రూ.26.90 లక్షల విలువైన రూ.500 నోట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు రాజగోపాల్, హుసేన్ పీరా, కిరణ్ కుమార్, రాందాస్ గౌడ్, రాధాకృష్ణ, అజయ్ ఈశ్వర్ ను పోలీసులు అదుపులోకి తీసుకోగా, కమలేష్,
సుఖ్ రాంలు పరారీలో ఉన్నట్టు తెలిపారు. నిందితుల నుంచి రూ.56 లక్షల విలువ చేసే రూ.500 నకిలీ నోట్లు, కంప్యూటర్ పరికరాలు స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు.

**రూ" 56 లక్షల విలువ చేసే రూ.500 నకిలీ నోట్లు, కంప్యూటర్ పరికరాలు స్వాధీనం. వివరాలు వెల్లడించిన ఎస్పీ సింధూశర్మ.**



# విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు సాధించాలి.

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, డిసెంబర్ 14:**




ప్రభుత్వం అందిస్తున్న కామన్ డైట్ మెనూ ను సద్వినియోగం చేసుకొని ఉజ్వల భవిష్యత్తు సాధించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం పెద్దకొడప్గల్ ఎస్సీ బాలుర వసతి గృహంలో నూతన డైట్ మెనూ ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సంక్షేమ వసతి గృహాల్లో నీ విద్యార్థుల కోసం సీజనల్ ఫ్రూట్, చికెన్, మటన్ వంటి పోషకాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. విద్య తో పాటు స్పోర్ట్స్ కూడా ఆడాలని విద్యార్థులకు తెలిపారు. ప్రత్యేక అధికారులు డైట్ ను పరిశీలించాలనీ తెలిపారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం డార్మెటరీ, కిచన్, టాయిలెట్స్ లను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి కిషన్, తహసీల్దార్ దశరథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్లాంజ్ తో సమర్ధవంతంగా తెగుళ్ల నివారణ

**- నాట్కో క్రాప్ హెల్త్ సైన్సెస్ జాతీయ సేల్స్ మార్కెటింగ్ హెడ్ సార నర్సయ్య.**




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 14:**




శిలీంధ్ర నాశిని మందు గ్లాంజ్ తో పంటలకు సోకిన తెగుళ్లను సమర్ధవంతంగా నివారించవచ్చని నాట్కో క్రాప్ హెల్త్ సైన్సెస్ జాతీయ సేల్స్ మార్కెటింగ్ హెడ్ సార నర్సయ్య అన్నారు. నగరంలోని ప్రైవేట్ హోటల్ లో కంపెనీ డిస్ట్రిబ్యూటర్లు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సార నరసయ్య మాట్లాడుతూ, సమావేశంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన నాట్కో క్రాప్ హెల్త్ సైన్సెస్ కంపెనీ అంతర్జాతీయ ప్రమాణాలతో, ఆధునాతన సాంకేతిక పరిశోధనతో రూపొందించిన నూతన ఉత్పాదన గ్లాంజ్ ను మంగళవారం మార్కెట్లోకి విడుదల చేసినట్టు తెలిపారు. తమ విస్తృత శ్రేణి ఉత్పత్తుల్లో ఒకటైన గ్లాంజ్ వివిధ పంటలలో సోకే వ్యాధుల నియంత్రణకు దీన్ని రూపొందించామని తెలిపారు. పర్యావరణపరంగా బాధ్యతాయుతమైన పద్ధతులను ప్రోత్సహిస్తూ ఉత్పాదకతను పెంపొందించాలనే తపనతో తాము దీనిని మార్కెట్లోకి తెచ్చామని నర్సయ్య వివరించారు. పర్యావరణపరంగా బాధ్యతాయుతమైన పద్ధతులను ప్రోత్సహిస్తూ ఉత్పాదకతను పెంపొందించాలనే తపనతో తాము దీన్ని మార్కెట్లోకి విడుదల చేశామన్నారు. రైతుల శ్రమకు తగ్గ రీతిలో అధిక దిగుబడిని కల్పించడమే తమ లక్ష్యమని సార నరసయ్య పేర్కొన్నారు. 'గ్లాంజ్' మందు వరిలో మానివండు, కాటుక, గోధుమ రంగు మచ్చ తెగుళ్ల నివారణకు ఉపయోగపడుతుందన్నారు. టమాటలో ఆకుమాడు, మినుములో సిర్కోస్పొరా మచ్చ, మిరపలో బూడిద, అల్లనేరియా ఆకుమచ్చ, పక్షికన్ను, పత్తిలో ఆర్డినేరియా ఆకు మచ్చ తెగుళ్లను సమర్ధవంతంగా నివారిస్తుందని నర్సయ్య వివరించారు.
ఈ కార్యక్రమంలో కంపెనీ తెలంగాణ రీజనల్ సేల్స్ మేనేజర్ రొల్ల శ్రీధర్, హెచ్ ఓ మార్కెటింగ్ భార్గవ్,
తెలంగాణ మార్కెటింగ్ మేనేజర్ సోమ సుధీర్, టేరిటరీ మేనేజర్ నరేష్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలకు చెందిన నాట్కో డిస్ట్రిబ్యూటర్లు పలువురు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సంక్షేమ హాస్టళ్లలో కామన్ డైట్ ప్లాన్ ప్రారంభం.

**కోటయ్యక్యాంప్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో లాంఛనంగా ప్రారంభించిన కలెక్టర్. కోటగల్లీ బీసీ, ఎస్సీ బాలికల వసతి గృహాలు తనిఖీ.**




**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, డిసెంబర్ 14**

: రాష్ట్రంలోని అన్ని సంక్షేమ హాస్టల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఒకే విధమైన డైట్ ప్లాన్ ను ప్రవేశపెట్టగా జిల్లాల్లోని వివిధ వసతి గృహాలలో అధికారులు, ప్రజాప్రతినిధులు శనివారం ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో భాగంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వర్ని మండలం కోటయ్య క్యాంప్ లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో కామన్ డైట్ ప్లాన్ ను లాంఛనంగా ప్రారంభించారు. పాఠశాలలోని స్టోర్ రూం ను సందర్శించి, కూరగాయలు, సరుకులు, ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, ఉన్నత లక్ష్యాల దిశగా విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. అన్ని సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థిని, విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు వీలుగా ప్రభుత్వం కామన్ డైట్ ప్లాన్ ను ప్రారంభించిందని తెలిపారు. వసతి గృహాలు, పాఠశాలల విద్యార్థుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం 40 శాతం డైట్ చార్జీలను, 200 శాతం కాస్మొటిక్ చార్జీలను పెంచడం జరిగిందన్నారు. తద్వారా పిల్లలకు పోషకాలతో కూడిన బలవర్ధక ఆహారం అందాలని, వారు మరింత మెరుగైన విద్యను అభ్యసించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని అన్నారు.



ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.
గణితం, ఆంగ్లం సబ్జెక్టులు అంటే భయాన్ని విడనాడాలని, పాఠాలు అర్థం కాకపోతే సంకోచించకుండా ఉపాధ్యాయులను అడిగి సందేహాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటున్నామనే భావనను దరి చేరనివ్వకుండా ఏకాగ్రతతో చదువుకుని జీవితంలో స్థిరపడడం ద్వారా కన్నవారి కలలు నిజం చేయాలని, గురువులకు మంచి పేరు తేవాలని హితవు పలికారు. భవిష్యత్తులో ఎంత ఎత్తుకు ఎదిగినా, తల్లిదండ్రులను మర్చిపోకుండా వారి ఆశయాల సాధనకు కృషి చేయాలని మార్గనిర్దేశం చేశారు. కాగా, జిల్లా వ్యాప్తంగా గల అన్ని సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలను ఇకనుండి అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేస్తారని కలెక్టర్ తెలిపారు. కొత్త డైట్ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారా? పరిశుభ్రతను పాటిస్తూ నాణ్యమైన ఆహార పదార్థాలు వినియోగిస్తున్నారా లేదా అన్నది పరిశీలిస్తారని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి.

అంతకుముందు కలెక్టర్ జిల్లా కేంద్రంలోని కోటగల్లీలో గల బీసీ, ఎస్సీ బాలికల వసతి గృహాలను తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జిల్లా బీసీ సంక్షేమ సహాయ అధికారి నర్సయ్య, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి భూమయ్య, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఏ.ఓ బి.సహదేవ్, సంక్షేమ వసతి గృహాల నిర్వాహకులు రాధారాణి, కల్పన తదితరులు ఉన్నారు.

# గ్రూప్-2 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి.

**- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, డిసెంబర్ 14 :**




తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఈ నెల 15, 16వ తేదీలలో జరగనున్న గ్రూప్-2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. 15న ఉదయం 10.00 గంటల నుండి మధ్యాన్నం 12.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 3.00 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండ్ సెషన్ పరీక్షలు జరుగుతాయని, ఆ మరుసటి రోజైన 16వ తేదీన కూడా అవే సమయాలలో రెండు సెషన్ లలో పరీక్షలు జరుగుతాయని వివరించారు.

జిల్లాలో మొత్తం 19854 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా మొత్తం 63 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా ఫ్లయింగ్ స్క్వాడ్ లను నియమించామని, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు అనుక్షణం నిశిత పర్యవేక్షణ జరుపుతామని, సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగుతాయని కలెక్టర్ స్పష్టం చేశారు.

బయో మెట్రిక్ విధానం ద్వారా వేలిముద్రల సేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. ఉదయం పరీక్షకు సంబంధించి 9.30 గంటల వరకే పరీక్షా కేంద్రం లోనికి వెళ్లేందుకు అనుమతించడం జరుగుతుందని, అనంతరం గేట్లు మూసివేస్తారని, మధ్యాహ్నం పరీక్షకు సంబంధించి 2.30 తరువాత ఎవరినీ లోనికి అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రం లోనికి మొబైల్ ఫోన్, పుస్తకాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు వంటివి తీసుకువెళ్లేందుకు అనుమతి లేదని, ఈ మేరకు ప్రతి కేంద్రం వద్ద క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని ఆదేశించామన్నారు. పరీక్షా సమయం ప్రారంభం నుండి ముగిసేంత వరకు పరీక్ష కేంద్రం నుండి అభ్యర్థులతో పాటు ఇన్విజిలేటర్లు కూడా బయటకు వెళ్లకూడదని తెలిపారు. అభ్యర్థులు తమ వెంట పరీక్ష హాల్ టికెట్, బ్లాక్/ బ్లూ బాల్ పాయింట్ పెన్ తెచ్చుకోవాలని. ఏదేని ఒరిజినల్ గుర్తింపు కార్డు (ఆధార్/ డ్రైవింగ్ లైసెన్స్/ఓటర్ కార్డు/ పాన్ కార్డ్/పాస్ పోర్ట్ వంటివి) తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలని, హాల్ టికెట్ పై కలర్ ఫోటో అతికించుకోవాలని తెలిపారు. అభ్యర్థులు చెప్పులు వేసుకొని రావాలన్నారు.

అభ్యర్థి వివరాలు ముద్రించబడిన ఓ.ఎం.ఆర్ షీట్ పై నలుపు/ నీలం బాల్ పాయింట్ పెన్నుతో బబ్లింగ్ చేయాలని కలెక్టర్ జాగ్రత్తలు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలను ప్రశాంత వాతావరణంలో సాఫీగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని అన్నారు.

# న్యూ కామన్ డైట్ మెను ప్రారంభం.

**- ఆయా నియోజకవర్గాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, డిసెంబర్ 14:**




రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన న్యూ కామన్ డైట్ మెను ను ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ఘనంగా ప్రారంబించారు. బాన్సువాడ మండల పరిధిలోని బోర్లం మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మెన్ కాసుల బాలరాజు ప్రారంబించారు. పాఠశాల మెస్ ను తనిఖీ చేసి కూరగాయలను, పప్పులను, వంట సామగ్రిని పరిశీలించారు అనంతరం బాలికలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

**జగంపల్లిలో కేవిఆర్...**

కామారెడ్డి నియోజకవర్గంలోని జగంపల్లి లో గల మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణరెడ్డి నూతన మెనునూ ప్రారంబించారు. మెస్ ను తనిఖీ చేసి, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

